నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | ఏప్రిల్ 28, 2024 | www.navatelangana.com

ఓటు హక్కు వినియోగంపై ట్రాన్స్‌జెండర్స్‌కు అవగాహన

నిర్మల్ : మహిళ శిశు, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ, స్వీప్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లోని డీడబ్ల్యుఓ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్స్‌కు ఓటు హక్కు, ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి నాగమణి హాజరై మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్స్ వచ్చే పార్లమెంట్, ఇతర ఎన్నికల్లో తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందుకుగాను ఓటు హక్కు లేని వారు నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటును బాధ్యతగా వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ట్రాన్స్‌జెండర్స్, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రూ.2లక్షల మద్యం పట్టివేత

నవతెలంగాణ-జైపూర్

మంచిర్యాల జిల్లా నుండి మహారాష్ట్రకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక ఎస్సై రాములు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. మద్యం నిల్వలను రహస్యంగా మహారాష్ట్రకు తరలిస్తుండగా సమాచారం మేరకు శనివారం భీమారం పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా కన్పించిన టాటా ఏసీ వాహనం తనిఖీ చేయగా మద్యం నిల్వలను గుర్తించారు. కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన మహమ్మద్ షరీఫ్‌తో పాటు అదే గ్రామానికి చెందిన తిప్పా రమణయ్య సుమారు రూ.2 లక్షలు విలువ చేసే మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వాహనాన్ని సీజ్ చేసి తదుపరి విచారణ కోసం భీమారం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



ఇండస్ట్రీయల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తాం



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెద్దపల్లి పార్లమెంట్ నుండి పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను గెలిపిస్తే రానున్న రోజుల్లో పార్లమెంట్ పరిధిని ఇండస్ట్రీయల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు తప్పకుండా అమలు చేస్తుందని ప్రజల విశ్వసిస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా గతంలో తెలంగాణ కోసం పోరాటం చేశానని, జైపూర్ మండలంలో పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేశానని తెలిపారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునఃప్రారంభించడం కోసం కేంద్ర పభుత్వంపై ఒత్తిడి తెచ్చానని తెలిపారు. ఫలితంగా ఈ రోజు ఎరువుల కర్మాగారం పని చేస్తుందని, రానున్న రోజుల్లో పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ గెలుపొందితే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అదేవిధంగా చెన్నూర్ నియోజకవర్గంలో మంచి నీటి సమస్య లేకుండా చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన చెన్నూర్ పట్టణానికి చెందిన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్, మాజీ జెడ్పీ వైస్ చైర్మెన్ మూల రాజిరెడ్డి, చెన్న సూర్యనారాయణ, ముత్యాల బాపగౌడ్, చీర్ల సుధాకర్‌రెడ్డి, గుడిసెల బాపురెడ్డి, గజ్జల అంకాగౌడ్ పాల్గొన్నారు.

ఆత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమై ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా కష్టపడి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ స్కీములను ప్రజలకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, పార్టీ సీనియర్ నాయకులు, మండల ఎన్నికల ఇన్‌చార్జి మిక్కిలినేని రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య, గుర్రం మోహన్‌రెడ్డి, రవి, బాదావత్ సుధాకర్ నాయక్, కంటెం శంకర్, దాముక కరుణాకర్, సయ్యద్ ఇబ్రహీం, కమ్ముల రవి, జాడి రాజేశ్వర్, దుర్గం లక్ష్మీనారాయణ, అల్లం వెంకట్ రాజం పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రదేశాల్లో నీడ, తాగు నీటి వసతి కల్పించాలి

నవతెలంగాణ-జైపూర్

ఎండలు మండిపోతున్నందున గ్రామీణ ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో కూలీల సౌకర్యార్థం గ్రీన్ షెడ్డులు, తాగు నీటి వసతి కల్పించాలని భీమారం ఎంపీడీఓ రాధా రాథోడ్ సూచించారు. శనివారం భీమారం గ్రామ పంచాయతీ పోతన్‌పల్లి శివారులో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. విధిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పనుల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో ఉండి నిర్దేశిత కొలతలతో పనుల కొనసాగింపుకు కృషి చేయాలన్నారు. కూలీలు 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎండకు ముందే పనులు ముగించుకోవాలని సూచించారు. అనంతరం పోతన్‌పల్లి, దాంపూర్, ధర్మారం, నర్సింగాపూర్ గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కమిటీ సభ్యులతో సమావేశమై పనుల తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు.

కేజీబీవీ విద్యార్థులను అభినందించిన కలెక్టర్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో జిల్లా కేజీబీవీలు మొదటి స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడానికి కృషి చేసిన డీఈఓ రవీందర్‌రెడ్డిని, కేజీబీవీ ప్రత్యేక అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాను విద్యా రంగంలో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు.

శ్రమకు గుర్తింపు ఏదీ..?

- అనేక మంది దరిచేరని ఈ-శ్రమ్ కార్డులు
- అవగాహన లేక.. దరఖాస్తు చేసుకోలేక నష్టం
- అసంఘటిత రంగ కార్మికుల పట్ల అధికారుల నిర్లక్ష్యం
- కేంద్రం నుంచి వచ్చే ప్రయోజనాలకు దూరం

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డులు అర్హుల దరికి చేరడం లేదు. అసంఘటిత రంగ కార్మికులు ప్రమాదాలకు గురైతే వర్తించాల్సిన బీమా సౌకర్యాలు పొందడం లేదు. అనేక మంది వద్ద ఈ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి దక్కాల్సిన ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ప్రభుత్వం ప్రచారం నిర్వహించకపోవడం..అవగాహన కల్పించాల్సిన అధికారులు అలసత్వం వహించడం మూలంగా వేలాది మంది అసంఘటిత రంగ కార్మికులకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్పితే అమల్లోకి రావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాలు ఓ వైపు కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామంటూ పథకాలు ప్రవేశపెడుతుంటే.. మరోవైపు వాటిని అమలు చేయాల్సిన అధికారులు ఉదాసీన వైఖరి అవలంభించడం మూలంగా వేలాది మంది కార్మికులు అవస్థలు పడాల్సి వస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం 2021లో ఈ-శ్రమ్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా వివిధ సంస్థల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం పొందలేని వివిధ రంగాలకు చెందిన కార్మికులందరూ ఈ శ్రమ్ కార్డులు పొందేందుకు అర్హులుగా ప్రకటించింది. ఆధార్, రేషన్‌కార్డు ఆధారంగా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటే కేంద్రం ఈ శ్రమ్ కార్డును మంజూరు చేస్తుంది. ఈ కార్డు ఉంటే పనిలో భాగంగా ఏదైనా ప్రమాదం సంభవించి మరణిస్తే బాధిత కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు బీమా సౌకర్యం కల్పించబడుతుంది. శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుంది. ఇలాంటి ప్రమాదాలకు గురైన వారి కుటుంబ సభ్యులు ఈ శ్రమ్‌కార్డు ఆధారంగా మరణ ధ్రువీకరణపత్రం, లేదంటే అంగవైకల్యం ఏర్పడినట్లు ధ్రువపత్రం సహాయంతో మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలి. అనంతరం మాన్యువల్ కాపీలను కార్మికశాఖ అధికారులకు అందజేస్తే వారు ప్రభుత్వానికి పంపిస్తారు. అక్కడ్నుంచి నిధులు విడుదల కాగానే బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తారు. ఈ సౌకర్యాన్ని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ కార్డులను ఆన్‌లైన్‌లో పొందేందుకు కేంద్రప్రభుత్వం సౌలభ్యం కల్పించింది. కానీ అధికారుల అలసత్వం కారణంగా వేలాది మంది కార్మికులు ఇలాంటి ప్రయోజనాలు పొందేందుకు దూరమవుతున్నారనే ఆరోపణలున్నాయి.



అవగాహన లేక ..కార్డులు పొందలేక..!

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో భాగంగా దుకాణాలు, వ్యాపార సంస్థలు, వ్యవసాయ కూలీలతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ఈ కార్డులు కలిగి ఉండేలా కార్మికశాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో 1,29,537మంది, మంచిర్యాల జిల్లాలో 1,08,328మంది, నిర్మల్ జిల్లాలో 94,856 మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 59,276మంది మాత్రమే ఈ కార్డులు పొందారు. ఈ పథకం ప్రారంభమైన తొలినాళ్లలో కార్మికశాఖ అధికారులు అక్కడక్కడ కొన్ని రోజుల పాటు అవగాహన కల్పించి విడిచిపెట్టారు. దీంతో ఈ కార్డులు పొందే విధానం..ఎక్కడ దరఖాస్తులు చేయాలి.. ఎవరు అర్హులు..ఎలాంటి ధ్రువీకరణపత్రాలు ఉండాలి తదితర వాటిపై వేలాది మందికి అవగాహన లేని కారణంగా ఈ కార్డులు పొందలేకపోయారు. దీంతో ఏదైనా ప్రమాదాలు సంభవించిన తరుణంలో బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆర్థిక సాయం లభించడం లేదు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోతున్న అనేక పేద కుటుంబాలు ఆర్థిక వలయంలో చిక్కుకుంటున్నాయి. ఇలాంటి వారికి తోడుగా ఉంటుందని ప్రవేశపెట్టిన ఈ పథకాలు అర్హుల దరికి చేరకపోవడం అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ కార్డులు కలిగి ఉన్న కొందరు ఇప్పటికే ఈ పథకం అమలు కోసం దరఖాస్తులు చేసినా కేంద్రం నుంచి నిధులు రావడంలో జాప్యం జరుగుతోందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

క్యాంపులు నిర్వహించిన అవగాహన కల్పించాం : రాజలింగు, జిల్లా సహాయ కార్మికశాఖ అధికారి, ఆదిలాబాద్

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై ఇది వరకు పలు చోట్ల క్యాంపులు నిర్వహించిన అవగాహన కల్పించాం. చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. అవసరమైన వారికి ప్రయోజనాలు కూడా దక్కుతున్నాయి. ఎన్నికల తర్వాత ఈ పథకంపై మరింత విస్తృతంగా ప్రచారం నిర్వహించి అర్హులైన వారందరికీ ఈ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

దేవుని పేరుతో రాజకీయం చేస్తారా?

- అభివృద్ధిపై ఓట్లు అడగాలి
- పథకాలు తెచ్చిందే కాంగ్రెస్ : మంత్రి సీతక్క

నవతెలంగాణ - బెజ్జూరు

దేవునిపై రాజకీయం చేసే నీచమైన సంస్కృతికి మోడీ సర్కార్ దిగజారిందని, రాజకీయాల కోసం దేవుళ్లను రోడ్లపైకి తీసుకొస్తారా? అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చుతామని చెబుతున్న బీజేపీని బొంద పెట్టాలని, ఓటుతో బుద్ధి చెప్పి అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి సుగుణక్కను గెలిపించాలని కోరారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. అటవీ హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు ఉపాధిహామీ చట్టాన్ని తీసుకొచ్చి పేదలకు ఉపాధి కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఉపాధి హామీ చట్టంలో కూలి రూ.400 పెంచుతామన్నారు. నల్లధనం వెలికితీసి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామన్న మోడీ ఒక్కరికైనా ఒక్క పైసా వేశారా? అని ప్రశ్నించారు. అగ్నిపథ్ పథకంతో యువతకు ఉపాధి లేకుండా చేశారన్నారు. దేశం కోసం పాటుపడుతున్న కుటుంబం ఇందిరమ్మ కుటుంబమని, అలాంటి కుటుంబాన్ని ఆదరించాలని కోరారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా రైతుబంధు పూర్తిస్థాయిలో పడలేదని, ఎన్నికల కోడ్ అనంతరం ప్రతి రైతుకు రైతుబంధు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల్లో ఉన్న వారిని పనికి రాని వారిగా బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారని, తాము పాలకులం కాదు ప్రజా సేవకులమని, ఆ సేవల్లో పొరపాట్లు జరిగితే సరిదిద్దుకుంటామని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలపై ఇంటింటికెళ్లి ప్రచారం చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి సుగుణ మాట్లాడుతూ ఆడబిడ్డకు ఒక్క అవకాశం ఇవ్వాలని, తనకు అవకాశం ఇస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకొచ్చామని, దాన్ని చేసి తీరుతామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను చూశారని, తాను పోరాటాలతో ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చానని, తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి వంద ఓట్లు వేసే విధంగా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ గత ఎన్నికల్లో తుపాకీ రాముడి మాటలు విని తనను ఓడించారని, అయినా తాను ప్రజల మధ్యనే ఉన్నానన్నారు. ఎప్పుడూ పేద ప్రజల పక్షాన ఉంటూ వారికి సేవ చేశానని, ఎప్పటికీ సేవ చేస్తానన్నారు. తన హయాంలో ఎంతో అభివృద్ధి చేశానని, ఇప్పుడు కొన్ని రోడ్లకు అనుమతులు తీసుకొస్తే దాన్ని తాను చేశానని ఎమ్మెల్యే హరీష్‌బాబు చెప్పుకోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ మాట్లాడుతూ అటవీ హక్కు పత్రాలు కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిందని, అటవీ భూముల కోసం పోరాటం చేస్తే తమపై ఎన్నో కేసులు అయ్యాయని తెలిపారు. రైతులపై కేసులు కాకుండా చూశామని, అదే ఇప్పటి ఎమ్మెల్యే హరీష్‌బాబు రైతులపై కేసులు పెట్టించి ఘనత సాధించాడని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నుండి కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, టీపీసీసీ కార్యదర్శి అనిల్, మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, భరత్, ఎంపీపీలు డోకె రోజారమణి, దుబ్బుల నానయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మండలాధ్యక్షుడు బూస శంకర్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, నాయకులు నాహెర్ అలీ, జావీద్ అలీ, కోంద్ర జగ్గాగౌడ్, జాహిద్, నరేందర్‌గౌడ్, మహేష్, కొడప విశ్వేశ్వర్, అఖీం, డోకె వెంకన్న, చౌకత్ అలీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.





బీజేపీ గెలిస్తే సింగరేణి ఆదానీ, అంబానీ కంపెనీగా మారుతుంది

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-మంచిర్యాల

బీజేపీ గెలిస్తే సింగరేణి సంస్థ ఆదానీ, అంబానీ కంపెనీగా మారుతుందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం దాన్ని ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శనివారం పట్టణంలోని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముంపుకు బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వలే కారణమన్నారు. ప్రజల బాధలకు కారణమైన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి, ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీని ఎంపీగా గెలిపించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే సగం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీపరం చేసిందని, మళ్లీ గెలిస్తే ప్రభుత్వరంగ సంస్థలే ఉండకుండా చేస్తుందని పేర్కొన్నారు. మరోసారి గెలిస్తే భారత రాజ్యాంగాన్నే రద్దు చేస్తామని బీజేపీ నాయకులు చెబుతున్నారని, ఓటర్లు ఆలోచించి బీజేపీని ఓడించాలని కోరారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు జరపడం కోసం బీజేపీ ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే నల్లధనం బయటకు తీసి ప్రతి ఒక్క పేద కుటుంబానికి రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పి నేటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి 10సంవత్సరాల్లో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, గుమాస ప్రకాష్, ఎర్మ పున్నం, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్, చందు, దూలం శ్రీనివాస్, అశోక్, దాగం రాజారాం పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్



నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని తెలిపారు. ఈవిఎంలు, ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారుల రవాణా కోసం బస్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కవగా ఉన్నందున ఓటర్లను ఉదయం నుంచే ఓటు వేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో విస్తృత అవగహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లకు సహాయం చేసేందుకు స్కౌట్లు, ఎన్‌సీసీ విద్యార్థుల వంటి వారిని వాలంటీర్లుగా నియమించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ, విద్వేష ప్రసంగాలను నివారించడానికి ఎస్ఎస్‌టి, విఎస్‌టి, వివిటి, ఎఫ్ఎస్‌టి టీంలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అంతర్ రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసి అక్రమ డబ్బు, మద్యం సరఫరాను అరికట్టాలన్నారు. జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, ఇప్పటి వరకు పట్టుబడ్డ నగదు, మద్యం, చెక్ పోస్టులు, వివిధ రకాల టీంలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్వో భుజంగ్‌రావ్, ఆర్డీవో రత్నకళ్యాణి, రవాణా శాఖ అధికారి దుర్గాప్రసాద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి పాల్గొన్నారు.

కొత్తగా రెండు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని సావర్గాంలో ఓటర్ల సంఖ్య 350 ఉండడంతో అక్కడే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ ఓటర్లు బుగ్గారం(కె) గ్రామానికి వెళ్లి ఓటు వేయడానికి ఇబ్బంది పడుతుండడంతో శనివారం పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. చించోలినూ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంపీవో పాల్గొన్నారు. ఈ గ్రామాల ప్రజలకు ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను అధికారులు తెలియజేశారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | ఏప్రిల్ 28, 2024 | www.navatelangana.com

ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరికీ స్లిప్పులు అందాలి

నవతెలంగాణ-నార్నూర్



ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిపులు అందాలని తహసీల్దార్ రాజలింగం బీఎల్ఓలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో బూత్ నెంబర్ 15లో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఓటర్లకు ఓటరు స్లిపులు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. వారివెంట ఆర్ఐ కవిత, బీఎల్ఓ రంజిత, రెవెన్యూ సిబ్బంది రమేష్ ఉన్నారు.

జోరుగా కాంగ్రెస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పాత ఉట్నూర్, ఆయా కాలనీల్లో కాంగ్రెస్ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలోని విషయాలను ప్రజలకు వివరించారు. శనివారం పార్టీ మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యుమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. పేద బిడ్డ, ఆదివాసీ బిడ్డా మహిళకు తొలి సారి ఎంపీగా ఎన్నిక బరిలో అవకాశం దక్కిందని ప్రజలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓట్లు వేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు రాజేష్ జాదవ్, ప్యాక్స్ చైర్మెన్ ఎస్‌పీ రెడ్డి, నిసార్ పాల్గొన్నారు.



సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- అరగంటలో ముగింపు
- అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం



నవతెలంగాణ-తాంసి

మూడు నెలలకు ఒక సారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదాగా నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశం అధికారులు అరగంటలోనే ముగించేశారు. వైస్ ఎంపీపీ అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. కేవలం ఆరుగురు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరయ్యారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు కొంతమంది గైర్హాజరయ్యారు. మొదటగా వైస్ ఎంపీపీ ఎజెండాను చదివి సమావేశాన్ని ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఏఈఓ వివరిస్తూ వేసవికాలంలో పండించిన జొన్న పంటలను తాంసి మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో తాత్కాలికంగా జొన్నల కొనుగోలును నిలిపివేశామని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రశేఖర్ వివరిస్తూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ ఏపీఓ సుజాత వివరిస్తూ మండలంలో 5,300 జాబ్ కార్డులు ఉండగా, 3,500 మంది కూలీలు పనులకు వెళ్తున్నారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముంతాజ్ వివరిస్తూ.. రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని రకాల సరుకులను అందించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ కంట్రోలర్ వివరిస్తూ ఆదిలాబాద్ నుంచి కరంజి వరకు రోజు 15 ట్రిప్పుల బస్సులను నడపడం జరుగుతుందని అన్నారు. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో బస్సులు చెడిపోవడం కాక డ్రైవర్ ఈ రూట్లకు రావడానికి జంకుతున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి రోడ్డు బాగు చేస్తే మరిన్ని ట్రిప్పులు నడపడానికి ఆర్టీసీ ముందుకు వస్తుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆదాయ ధృవీకరణ కుల ధృవీకరణ పత్రాలతో పాటు వివిధ పత్రాల జారీలలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం కనబడుతుందని, నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగాల్సి వస్తుందని అన్నారు. చిన్న కారణాలతో తహసీల్దార్ ముడి పెడుతున్నారని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశం అరగంటలోనే ముగిసింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ప్రతి మూడు నెలల కొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ పోటే శోభా అధ్యక్షతన నిర్వహించగా, మొత్తం 17 అంశాలపై జరుగాల్సి ఉండగా వ్యవసాయం, ఐసీడీఎస్, విద్య, అటవీ, వైద్యశాఖ, ఐకేపీ, ఈజీఎస్, తదితర శాఖల అధికారులు హాజరు కాగా, పంచాయతీ రాజ్, ఐటీడీఏ ఇంజనీరింగ్, మిషన్ భగీరథ అధికారులు గైర్హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు తమ తమ నివేదికను చదివి వినిపిస్తుండగా, కోఆప్షన్ సభ్యులు జిలానీ, ఎంపీపీ పోటె శోభాబాయి కల్పించుకుని పిట్ట బొంగరం వైద్యుడు ప్రతాప్ నాయక్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఈ నెల 18న దస్నాపూర్‌గూడకు చెందిన ఉపాధికూలీ ఎండలో పనిచేసి అస్వస్థతకు గురికావడంతో చికిత్సకై పిట్టబొంగరం సీహెచ్‌సీకు తరలించగా అప్పటికే మరణించాడు. అక్కడి వైద్యుడు మాత్రం గుండె పోటుతో మరణించాడని తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. పేద కూలీలు తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇవ్వడం వలన ఆతనికి ఈజీఎస్ శాఖ ద్వారా వచ్చే ఆర్థిక సాయం అందలేదని వైద్యునిపై మండిపడ్డారు. సమావేశానికి తన కింది స్థాయి సిబ్బందిని ఎందుకు పంపారని, వైద్యుడు వచ్చి సమాధానం చెప్పాలని పట్టు బట్టారు. చివరికి డాక్టరుపై చర్యలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని పేర్కొనడంతో సభ్యులు శాంతించారు. వైద్యుడిపై వాడి వేడిగా సాగిన సమావేశం అనంతరం సాఫీగా సాగింది. ఈ సారి సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఎంపీటీసీల ఆధ్వర్యంలో సమావేశం కొనసాగింది. ఈ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ కే.భాస్కర్, ఎంపీటీసీలు గీత్తే ఆశ, స్వర్ణలత, అధికారులు విద్యాధికారి నర్సయ్య, ఈజీఎస్ ఏపీఓ జాదవ్ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం రామారావ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ అడెల్లి గ్రామ కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-సారంగపూర్

కాంగ్రెస్ మండలాధ్యక్షులు బొల్లోజి నర్సయ్య కిసాన్ సెల్ జిల్లా చైర్మెన్ అట్లా పోతారెడ్డి, ఉపాధ్యక్షులు కొత్తపెల్లి విలాస్‌రావ్‌ల ఆధ్వర్యంలో శనివారం అడెల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించి, గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. గ్రామ అధ్యక్షులుగా పిల్లి నాగయ్య, ఉపాధ్యక్షులుగా జువ్వాడి నరేందర్‌రావు, జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి షేక్ శంషీర్ ఖాన్, సంయుక్త కార్యదర్శి బొప్పారం గంగన్న, కార్యదర్శి తోట శంకర్, సభ్యులు సోహెల్, సత్య గంగారావు, సాదిక్, అక్బర్ ఖాన్, పిల్లిశేఖర్, అరుణ్‌రావు, సాబీర్, అర్జున్, సమీర్ ఖాన్, భోజన్న, ఇమ్రోజ్ ఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గండ్రత్ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని కచ్‌కంటి గ్రామంలో బీఆర్ఎస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించి, మాజీ సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని అన్నారు. ఈ ప్రచారంలో ఆదిలాబాద్ మండల మాజీ ఎంపీపీ సెవ్వ లక్ష్మి జగదీష్ యాదవ్, గంగయ్య యాదవ్, రమణ, కోఆప్షన్ సభ్యులు షేక్ ఆరిఫ్, దేవిదాస్, బుచ్చన్న పాల్గొన్నారు.

ఆత్రం సుగుణను పార్లమెంటుకు పంపిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను పార్లమెంటుకు పంపిస్తామని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్ద మాలెబోరిగాం, చిన్న మాలె బోరిగాం, ధర్మగూడ, కేబీ కాలనీ, చించుఘాట్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో గూడెల్లో తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా చైర్మెన్ సెడ్మకి ఆనంద్‌రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, రాము పటేల్, శ్యామ్‌రావు పటేల్, సెడ్మకి భీంరావు, మెస్రం నాగోరావ్, కుంరం రాజు పటేల్, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, నలిమెలి నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చిన హామీలను విస్మరించి, కాంగ్రెస్ పాలన సాగిస్తుందని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించకపోతే పథకాలను నిలిపివేస్తామనే విధంగా నాయకులు ప్రసంగాలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. శనివారం పట్టణంలోని రీక్షాకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తు కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాలనీలో ఇస్త్రీ చేసి ఓటర్లను ప్రభావితం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ బీఆర్ఎస్ హాయాంలో ప్రతి పేదోడికి పథకాలను అందించామన్నారు. కేంద్రంతో కోట్లాడి నిధులు తీసుకువచ్చి అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ఆదిలాబాద్‌లో సీసీఐ పునరుద్ధరణ, ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయం, యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్కు ఇవ్వలేదన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే వీటి సాధన కోసం పార్లమెంట్‌లో గళమెత్తుతానని పేర్కొన్నారు. ఈ కార్యకమంలో నాయకులు అజయ్, భారత్, శివకుమార్, స్వరూప, మమత, రాము, నారాయణ, పండ్ల శ్రీను, దాసరి రమేష్, పర్వీన్, రాజు పాల్గొన్నారు.

ఇంటిపై జెండాల తొలగింపుతో రాస్తారోకో

నవతెలంగాణ-తాంసి

ఇంటిపై ఉన్న కాషాయం జండాల తొలగింపుతో శనివారం పొన్నారి గ్రామ బీజేపీ శ్రేణులు అంతర్‌రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో సమాచారం తెలియడంతో తహసీల్దార్ లక్ష్మి, ఎస్సై శివరాం గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బీజేపీ నాయకులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇటువంటి జెండాలు పోస్టర్లు ఉండకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలతో జెండాలను తొలగించడం జరుగుతుందన్నారు. కొంతసేపు రోడ్డుపై ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పార్టీ శ్రేణులను ఎస్సై, తహసీల్దార్ సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ రెడ్డి, నారాయణ, సంతోష్ సదానందం, మహేందర్, విలాస్, మల్లికార్జున్, సతీష్‌రెడ్డి, స్వామి ఉన్నారు.

మే 1 నుంచి ఉచిత వేసవి సైన్సు శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మే ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి సైన్స్ శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని అధ్యక్షులు సంతోష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు ఆసక్తి గల ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు 9491558760 నెంబరులను సంప్రదించాలని తెలిపారు. పట్టణంలోని సంస్కార్ ఉన్నత పాఠశాలలో ఈ ఉచిత శిక్షణ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బేలలోనే పరీక్ష కేంద్రం కొనసాగించాలి



నవతెలంగాణ-బేల

బేలలోని కీర్తన డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ బేలాలోనే కొనసాగేలా చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్‌కు కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వరప్రసాద్‌రావు వినతిపత్రం ఇచ్చారు. బేలా మండల కేంద్రం మారుమూల గ్రామాల్లో ఇప్పటికి రవాణా సౌకర్యం లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయని అన్నారు. అందులో సుమారు 400 మంది గిరిజన విద్యార్థునులు, ఆదిలాబాద్ పోలేక డిగ్రీ విద్యకు దూరమవుతున్నారని అన్నారు. ఎలాంటి సమస్య లేకుండా ప్రశాంతంగా ఉన్న సెంటర్‌ను యూనివర్సిటీ అధికారులు తొలగించడం వలన విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లారు. మొత్తం యూనివర్సిటీ పరిధిలోనే ఇన్ని కిలోమీటర్ల దూరంలో ఏ సెంటర్ లేని విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. వెంటనే ఎమ్మెల్యే పాయల శంకర్ కాకతీయ యూనివర్సిటీ వీసీ రమేష్, అదనపు పరీక్షల నిర్వాహణ అధికారి తిరుమలదేవితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీనిచ్చారు.

కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎన్నికల కోడ్ పటిష్ఠంగా అమలు చేయాలని పేర్కొన్నారు. కేసుల త్వరితగతిన పరిష్కారం, 100 డయల్‌కు ఫోన్ వస్తే వెంటనే స్పదించే విధానం. తదితర విషయాలపై తగు సూచనలు చేశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించునేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణ జరుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుమాంజలి, ఏఎస్సై భీంరావు, పోలీసు సిబ్బంది గంగారెడ్డి, రమేష్, యాసిన్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రచార రథం షురూ..

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బీజేపీ పార్లమెంటు ఎన్నికల ప్రచార రథాన్ని శనివారం పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు ఆరెళ్లి రాజలింగం మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని లక్షపై చిలుకు మెజారిటీతో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీని కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రచార రథాన్ని ప్రతి వాడవాడకు, గూడెనికి వెళ్లి ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడప గడపకు ప్రజలవద్దకు వెళ్లి వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్క పుష్ప లత, దీపక్ సింగ్, రాధిక రాథోడ్ పాల్గొన్నారు.

జొన్న పంట కొనుగోళ్ల పరిమితిని పెంచాలి



వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆందోళన చేస్తున్న రైతులు

నవతెలంగాణ-బోథ్

జొన్న పంట కొనుగోళ్ల పరిమితిని పెంచాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్ల రాజు అన్నారు. శనివారం జొన్న కొనుగోళ్ల పరిమితిని పెంచాలని రైతులతో కలిసి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆందోళ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలో జొన్న పంటలను కొనుగోళ్లు చేస్తున్న తరుణంలో ఎకరానికి 8.85 క్వింటాళ్లు కొనుగోళ్లు చేస్తుందని అన్నారు. ఈ సంవత్సరం వాతావరణం బాగుందని జొన్న పంట ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్లు దిగుబడి వచ్చిందని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఎకరానికి 8 క్వింటాళ్ల 85 కిలోలు మాత్రమే కొనుగోలు చేయడం సరికాదన్నారు. అలాగే మిగిలిన పంట అమ్ముకోవడానికి దళారుల వద్ద మోసపోతున్నామని అన్నారు. గత ప్రభుత్వం ఎకరానికి 13 క్వింటాళ్ల కొనుగోలు చేసిందన్నారు. అలాగే ఈ సంవత్సరం అధిక దిగబడి రావడంతో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సోమవారం నుంచి జొన్న పంట కొనుగోళ్లు పరిమితిని పెంచకపోతే రైతులచే మండల కేంద్రంలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు అనిల్, ఆప్కా సంజీవ్, భీంరావు, రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేయాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్

నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్రంలోని మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 138వ మేడే వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను మోసం చేసిందని అన్నారు. ఇలాంటి మోసపూరితమైన బీజేపీ నరేంద్ర మోడీ మాటలు ప్రజలు, కార్మికులు, రైతులు నమ్మవద్దని అన్నారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య ఐక్యతను శ్రమజీవుల మధ్య ఐక్యతపై దాడి చేస్తుందన్నారు. కార్మిక వర్గం ఇటువంటి విభజన విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని, బీజేపీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక చట్టాల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ వంటి కార్మిక వ్యతిరేక విధానాలపై, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, స్కీం రంగాల కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కార్మిక వర్గం ఐక్యతను విస్తృతం చేసి బలమైన కార్మిక పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, నాయకులు మాలావత్ జెవింద్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గోనె స్వామి, నాయకులు కుడుదుల రాజేశ్వర్, గూట్ల ప్రసాద్, మాన్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

పథకాల అమలు కేసీఆర్‌తోనే సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మాజీ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతాయని బీఆర్ఎస్ నాయకులు ప్రచారంలో భాగంగా ఓటర్లకు వివరించారు. శనివారం భీంపూర్ మండల కేంద్రంతో పాటు తాంసి మండలంలోని వడ్డాడి గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుధాకర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం కులమత విద్వేషాలను రెచ్చగొట్టి కోట్లు దండుకోవడానికి చూస్తుందన్నారు. ఈ రెండు పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నాగయ్య, వైస్ ఎంపీపీ లస్మన్న, తాంసి, భీంపూర్ మండలాల నాయకులు కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, అనిల్, శ్రీనివాస్, రమణ, భూమన్న, రఘు, రాజన్న, మహేందర్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | ఏప్రిల్ 28, 2024 | www.navatelangana.com

కూలి డబ్బుల కోసం అధికారుల నిలదీత

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని నందిగూడలో గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసిన కూలీలు డబ్బుల కోసం అధికారులను నిలదీశారు. సాంకేతిక సమస్య కారణంగా రెండు వారాలుగా 20 మంది కూలీలకు డబ్బులు అందకపోవడంతో శనివారం ఆ గ్రామానికి వెళ్లిన ఏపీఓ బుచ్చన్న, టీఏ కిషోర్లను నిలదీశారు. సాంకేతిక సమస్య కారణంగానే తాము చెల్లించలేకపోయామని, త్వరలోనే కూలీలకు డబ్బులు చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఏపీఓ తెలుపడంతో శాంతించారు.

మత్తు పదర్థాలు విక్రయిస్తే చర్యలు

నవతెలంగాణ-వాంకిడి



మత్తు పదర్థాలు విక్రయిస్తు చర్యలు తప్పవని ఏఎస్పీ ప్రభాకర్ పాన్, టీ షాపు నిర్వాహకులకు హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం పాన్, టీ షాప్‌లలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు డీఎస్పీ సదయ్యతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతుండడంతో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, గుట్కా పాన్‌షాపులు, హోటళ్లలో కానీ విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీలో ఎస్సై సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాల్వల నిర్మాణంలో నిర్లక్ష్యం

- నెలలు గడుస్తున్నా పూర్తికాని పనులు • ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, ప్రజలు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రం గుండా నిర్మిస్తున్న నాలుగు వరుసల జాతీయ రహదారి నెంబర్ 363 నిర్మాణంలో జరుగుతున్న డీబీఎల్ పనుల జాప్యం కారణంగా ప్రయాణికులు, దుకాణ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నెలలు గడుస్తున్నా సైడ్‌డ్రేన్ల నిర్మాణ పనులు పూర్తికావడం లేదు. రెండేండ్లుగా సర్వీస్ రోడ్డు గుండా నిర్మించాల్సిన మురికి కాలువలు అసంపూర్తిగా వదిలివేయడంతో మండల కేంద్రంలో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అయినా సైడ్‌డ్రేన్ల నిర్మాణంపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీడడంలేదు. రెండేండ్లుగా రహదారి గుండా నిర్మించాల్సిన మురికి కాలువలు అస్తవ్యస్తంగా వదిలివేయడంతో అకాల వర్షాలతో కాలువల్లో మురికి, వరదనీరు ఇండ్లలోకి చేరుతుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టిసారించి పనులను పూర్తిచేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన గుంతలు

మండల కేంద్రంలో మహారాష్ట్ర వైపు నుండి వచ్చే బస్సులు నిలిపే ప్రాంతంలో ఆరు నెలల క్రితం తవ్విన గుంతలు ఇప్పటివరకు పూడ్చలేదు. ఆ ప్రాంతంలో రూ.మూడు కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా పెద్ద సిమెంటు పైపులు వేసేందుకు భారీ గుంతలు తవ్వారు. కానీ వాటి పనులు పూర్తికాకపోవడంతో ప్రమాదంగా మారాయి. స్థానికులతో పాటు ఆసిఫాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం ఈ ప్రాంతంలో వేచిచూస్తుంటారు. దుకాణ సముదాయాలు ఉండడంతో ఈ ప్రాంతంలో జనాల రద్దీ అధికంగానే ఉంటున్నారు. సైడ్‌డ్రేన్ల కోసం తవ్విన గుంతల వద్ద ప్రమాదకర సూచికపు బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. బోర్డు లేని కారణంగా అటువైపుగా వచ్చే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం కాకముందే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మురుగు కాల్వల కోసం తవ్విన గుంతలో నిండిన చెత్తాచెదారం



బస్టాండ్ పక్కనే తవ్విన గుంతలు

ప్రమాదాలు జరిగే అవకాశం

సైడ్‌డ్రేన్ల నిర్మాణం కోసం ఆరు నెలల క్రితం జేసీబీతో గుంతలు తవ్వి అలాగే వదిలేశారు. దాని ప్రక్కనే బస్టాండు నిర్మించారు. దీంతో ప్రయాణికులకు అనేక ఇబ్బందులు ఏర్పడడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పనులు నత్తనడకన సాగడంతో కష్టాలు తప్పడం లేదు. ప్రధాన రహదారి నిర్మాణంలో ఇంత జాప్యం జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రాణ నష్టం జరిగితే తప్ప పట్టించుకునేల కనిపించడం లేదంటూ మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులపై చర్యలు తీసుకోవాలి

సంతోష్, వ్యాపారి, వాంకిడి



మండల కేంద్రంలో డీబీఎల్ పనులు చేపట్టిన నాలుగు వరుసల రహదారిలో సైడ్‌డ్రేన్ల నిర్మాణం కోసం దుకాణాల ముందు ఆరు నెలల క్రితం గుంతలు తవ్వారు. ఇప్పటి వరకు పనులు పూర్తిచేయలేదు. దీంతో దుకాణాల యజమానులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటు ఇబ్బందులను తొలగించాలి.

బీజేపీని ఓడిస్తేనే కార్మిక చట్టాల పునరుద్ధరణ

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్రంలో బీజేపీని ఓడిస్తేనే కార్మిక చట్టాల పునరుద్దరణ సాధ్యమవుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గోదాంలో 138వ మేడే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పోరేట్లకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యదావిధిగా కొనసాగించడానికి, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడానికి, రాజ్యాంగాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. పౌరసరఫరాల శాఖలో పని చేసే హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎగుమతి-దిగుమతి రేట్లు క్వింటాలుకు రూ. 40 పెంచాలని, హమాలి, ఆటో, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని, భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందితే అతని కుటుంబానికి రూ. 10 లక్షలు చెల్లించాలని, రూ. ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, సభ్యులు సత్యనారాయణ, హేమాజీ, కిషన్, సురేష్, రాజు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షల నుండి పుట్టిందే బీఆర్ఎస్

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజల ఆకాంక్ష ఆశల నుండి పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, బీఆర్ఎస్ భవన్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించి, జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష ఆశలను ఆధారంగా చేసుకొని 2001 ఏప్రిల్ 27న అతి తక్కువ మందితో ప్రారంభమైన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. 1967 నుండి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వివిధ రూపాల్లో ఉద్యమం జరుగుతున్నప్పటికీ దేశప్రజల దృష్టిని తెలంగాణ వైపు మార్చడం సాధ్యం కాలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావంతో ప్రత్యేక రాష్ట్రం ఆకాంక్ష యావత్ ప్రపంచానికి తెలిసిందన్నారు. దీనికి నిదర్శనమే 2003లో వరంగల్‌లో నిర్వహించిన సభకు 15 లక్షల మంది ప్రజలు హాజరు కావడమని అన్నారు. ఇవే కాకుండా 2010లో అదే వరంగల్‌లో 20 లక్షల మందితో సభ నిర్వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించిన ఘనత ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి కట్టబెట్టారని గుర్తుచేశారు. అనుకున్న కలను సాకారం చేయడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాలకు నీరు అందించడంతో పాటు ప్రతి ఇంటికి తాగునీటి వసతి కల్పించిన ఘనత పార్టీకి దక్కిందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత ప్రజలు కోరిన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడమే బీఆర్ఎస్ పార్టీని ఇంత ఉన్నత స్థానంలో నిలబెట్టాయన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 9 సంవత్సరాల తెలంగాణలో తమ ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు ధృపదాబాయి, అజయ్ కుమార్, ఎంపీపీ సౌందర్య, ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మైనారిటీ నాయకుడు అబ్దుల్లా, నాయకులు లాల, సంగ్డే జీవన్, సలాం, శైలు, కార్తిక్, మోహన్, రవీందర్, గణేష్, నిసార్, కిష్టయ్య పాల్గొన్నారు.

నేడు సీఐటీయూ ఆధ్వర్యంలో సెమినార్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో 'పార్లమెంట్ ఎన్నికలు-కార్మికవర్గ కర్తవ్యం' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ సెమినార్‌కు సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే అంబలి పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజల దాహార్తి తీర్చేందుకే అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా(తారీక్) అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం మార్కెట్‌లో సంతను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి అనేకమంది వస్తారన్నారు. శనివారం కావడంతో ఈ రద్దీ మరింత పెరుగుతుందని దానిని దృష్టిలో ఉంచుకొని అంబలి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం దాదాపు 3000 మందికి అంబలి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ లయన్ వెంకట రమణారెడ్డి, రావుల వినాయక రావు, నాంపల్లి శంకర్, కార్యదర్శి పుల్లూరి శంకర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు

- డిసెంబర్‌లోగా 132 సబ్‌స్టేషన్ పనులు పూర్తి • ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



మరమ్మత్తు కేంద్రాన్ని తనిఖీ చేసిన సీఎండీ వరుణ్‌రెడ్డి

నవతెలంగాణ-కౌటాల

నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. అందులోని బ్రేకర్ల పనితీరును, లోడ్ వివరాలు, కెపాసిటీ, ఏఏ సబ్‌స్టేషన్‌లకు ఇక్కడి నుండి విద్యుత్ సరఫరా జరుగుతుంది, ఎంత వినియోగం అవసరముంది, విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయాల గురించి సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తు కేంద్రాన్ని పరిశీలించి దాని కెపాసిటీ, మరమ్మత్తుల వివరాలను సేకరించారు. మారుమూల ప్రాంతాల్లో సైతం నిరంతరం సరఫరా కోసం కృషి చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల్లో మాత్రమే కాకుండా నాణ్యత గల పరికరాలను వాడాలని, రైతులకు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరఫరా చేసే బాధ్యత ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం డిమాండుకు తగ్గట్టు సప్లాయి చేస్తున్నామని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో వ్యవసాయానికి సరఫరా కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టానన్నారు. వ్యవసాయం కోసం రైతులు పెట్టుకున్న వ్యవసాయ కనెక్షన్లను ప్రస్తుతం 60 శాతం ఉన్నాయని, వాటిని జూన్ చివరి నాటికి వంద శాతం అందించేందుకు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. వర్షాకాలంలో గాలి, వానల వల్ల విద్యుత్ స్తంభాలు విరగడంతో సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విరిగిన స్తంభాలు, తెగిన తీగలు, పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానాల్లో కొత్త వాటిని అమర్చాలని చెప్పారు. 60 శాతం రైతులకు నాణ్యమైన కోతలు లేని విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. కాగజ్‌నగర్‌లోని ఈజ్‌గాం 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుండి కౌటాల వరకు 33 కేవీ విద్యుత్ లైన్ పూర్తిగా అటవీ ప్రాంతం గుండా ఉండడం వల్ల వర్షాలు, గాలులు వచ్చినప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కౌటాల నుండి గుండాయిపేట్, రెబ్బెన, బెజ్జూరు వరకు 33 కేవీ విద్యుత్ సరఫరా జరుగుతుందని, ఈజ్‌గాం నుండి 70 కిలోమీటర్ల దూరం ఉండడం వల్ల నిత్యం సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. తలోడి గ్రామ శివారులో నిర్మిస్తున్న 132/33 కేవీ సబ్‌స్టేషన్ పనులు ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తికావాల్సి ఉందని, ఆ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత గుత్తేదారుకు సూచించారు. 132/33 సబ్‌స్టేషన్ మ్యాపు లైన్ వివరాలను తెలుసుకున్నారు. ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే ఈ ప్రాంతానికి నెలకొన్న విద్యుత్ సమస్యలు దాదాపు దూరమవుతాయని, రైతులకు మేలైన నిరంతరం విద్యుత్ సరఫరా జరుగుతుందని ఆయన తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని భరోసా ఇచ్చారు. 132/33, 11 కేవీ లైన్‌కు మొత్తం 105 టవర్లు వేయనుండగా ఇప్పటికీ 65 టవర్ల పునాదుల పనులు పూర్తయి అందులో కొన్ని టవర్లు పూర్తిచేయడం జరిగిందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. గడువులోగా పనులు పూర్తిచేసి 132/33 సబ్‌స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత గుత్తేదారుకు ఆదేశించారు. ఆయనతో పాటు టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్‌సీ వాసుదేవ్, డీఈ నాగరాజు, ఏడీఈ రాజేశ్వర్, ఏఈలు రవీందర్, శ్రీనివాస్, సంతోష్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

మున్నీ బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ

- రూ.3 లక్షలు అపహరణ
- కాగజ్‌నగర్ శివారు భట్టుపెల్లి గ్రామంలోనూ చోరీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంతో పాటు సమీపంలోని భట్టుపెల్లి గ్రామంలో ఒకే రాత్రి దొంగతనాలు జరిగాయి. పట్టణంలోని పెట్రోల్‌పంపులో ఉన్న మున్నీ బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ జరగగా, రూ. 3 లక్షల నగదు అపహరణకు గురైంది. బార్ యాజమాని కాకొల్లు వేణుగోపాల్ తెలిపిన ప్రకారం శుక్రవారం రాత్రి 11 గంటలకు బార్ మూసివేశారు. శనివారం ఉదయం బార్ అండ్ రెస్టారెంట్ తెరిచి చూడగా అప్పటికేపై కప్పు తొలగించి లోనికి ప్రవేశించిన దొంగలు కౌంటర్‌లోని రూ. 3 లక్షలను అపహరించారు. డాగ్ స్క్వాడ్, వేలి ముద్రల నిపుణులు సంఘటనాస్థలానికి వచ్చి విచారణ జరిపారు. టౌన్ సీఐ శంకరయ్య, ఎస్ఐ అంజయ్యలు బార్‌లోని సీసీ కెమెరాలో రికార్డ్ అయిన వీడియో ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నారు.

భట్టుపెల్లి గ్రామంలో...

కాగజ్‌నగర్ రూరల్ : కాగజ్‌నగర్ మండలం భట్టుపెల్లి గ్రామానికి చెందిన తోట శోభ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన ప్రకారం శోభ రాత్రి 11 గంటల సమయంలో ఇంటిపైకి వెళ్లి నిద్రించింది. శనివారం ఉదయం నాలుగు గంటల సమయంలో మంచినీరు తాగేందుకు కిందికి రాగా అప్పటికే ఇంటి తాళాలు పగులకొట్టి ఉన్నాయి. బీరువా తలుపులు తెరిచి అందులోని రూ. 50 వేల నగదుతో పాటు, మూడున్నర తులాల బంగారం చోరీ జరిగిందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రూరల్ ఎస్ఐ సోనియా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ శాతాన్ని పెంచేలా కృషి చేయాలి

- ఎన్నికల పరిశీలకులు రాజేంద్ర విజయ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మే 13న పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా అధికారులు కృషి చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ అన్నారు. శనివారం స్వీప్ యాక్టివిటీస్‌లో ఐ ఓట్ ఫర్ షూర్‌లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), సిర్పూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారితో కలిసి సెల్ఫీ బోర్డు వద్ద ఫోటో దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో మే 13న జరగనున్న పోలింగ్ కార్యక్రమంలో అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా జిల్లాలో విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని శాసనసభ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణను ప్రత్యేక బృందాలు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు కేటాయించడం జరిగిందన్నారు. 85 సంవత్సరాల వయసు పైబడిన వయోవృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులు హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ రోజున కేంద్రాలకు వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మే 13న జరగనున్న పోలింగ్ రోజున జిల్లాలోని అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఓటరు సెల్ఫీ ద్వారా ఫోటో దిగి వాట్సాప్, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తూ చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, తహసీల్దార్ నాగరాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, ఏఈ(టీడబ్ల్యూ) బద్రుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-వాంకిడి

కాంగ్రెస్ బలపరిచిన ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అధ్యక్షుడు గుర్నులే నారాయణ, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కార్యకర్తలను కోరారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి ప్రచారం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఐదు గ్యారెంటీలపై ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించాలని సూచించారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఆమె గెలుపు కోసం తమవంతు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి యువకుడు మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సంజీవయ్య కాలనీకి చెందిన బొమ్మెన వినోద్ (30) అధిక మద్యం సేవించి శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు టౌన్ సీఐ శంకరయ్య తెలిపారు. శంకర్-చంద్రమ్మ దంపతుల మూడో కుమారుడైన వినోద్ స్థానికంగా హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో నుండి వెళ్లిన వినోద్ తిరిగి ఇంటికి రాలేదు. స్థానిక భట్టుపెల్లి రోడ్డులోని రాయల్ ఫంక్షన్ హాలు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు వెళ్లి చూడగా, మృతుడు బొమ్మెన వినోద్‌గా గుర్తించారు. మృతుడు అతిగా మద్యం సేవించి ఎండకు తాళలేక, తాగడానికి నీరు దొరకక మృతి చెందినట్లు సీఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులు పరిజ్ఞానంపై దృష్టి సారించాలి

- జిల్లా విద్యాధికారి అశోక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పరిజ్ఞానంపై దృష్టి కేంద్రీకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు అధ్యక్షతన మూడు రోజుల పాటు విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా నిర్వహించనున్న రోబోటిక్, ప్రోగ్రామింగ్, ఎలక్ట్రానిక్, కోడింగ్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ అశోక్ మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక విధానంలో నూతనత్వం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుండి కంప్యూటర్‌పై అవగాహన కలిగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. ప్రస్తుతం అన్ని రంగాలలో రోబోటిక్స్, డ్రోన్ ఉపయోగిస్తున్నారని తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని 10 పాఠశాలల నుండి 50 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు భోనగిరి సతీష్ బాబు, కార్యదర్శి వేణుగోపాల్, ట్రస్మ జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, జిల్లా పరీక్షల విభాగం సహాయ అధికారి ఉదయ్ బాబు, కమిటీ సభ్యులు సంతోష్, శ్రీనివాస్, మోర సాయికృష్ణ, దీపక్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళను అప్పగించిన పోలీసులు

నవతెలంగాణ-జన్నారం



తప్పిపోయిన ఒక మహిళను గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు జన్నారం బ్లూకోట్ పోలీసులు అప్పగించారు. శనివారం హైదరాబాదుకు చెందిన లక్ష్మి మండలంలోని కొత్తూరు పల్లె గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చి తప్పిపోయారు. ఆమె కొత్తూరుపల్లిలో తిరుగుతుండగా చిన్నపిల్లలను ఎత్తుకపోయేవారని స్థానికులు బయభ్రంతులకు గురై 100కు ఫోన్ చేశారు. దీంతో బ్లూ కోర్ట్ పోలీసులు శ్రీనివాస్, నీలయ్య అక్కడికి వెళ్లి లక్ష్మిని గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణంలో కొప్పుల ఈశ్వర్ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పట్టణ నాయకులతో కలిసి విస్తృత ప్రచారం చేపట్టారు. ఉదయం ఠాగూర్ స్టేడియంలో మార్నింగ్ వాక్ మొదలుకొని సివిల్ కార్యాలయం, ఆర్కె ఓసీపీ, సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ప్రచారం నిర్వహించారు. అలాగే బి జోన్ సెంటర్, రాజీవ్ చౌక్, రామాలయం సూపర్ బజార్‌లో ప్రతి దుకాణాలో తిరుగుతూ పార్టీ ప్రచార కరపత్రాలు అందజేస్తూ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు.

గంజాయి అమ్ముతున్న యువకుడు అరెస్ట్



నవతెలంగాణ-మంచిర్యాల

పట్ట పగలు మంచిర్యాల పట్టణంలో నిషేధిత గంజాయి అమ్ముతూ పోలీసులకు చిక్కాడు ఒక యువకుడు. శనివారం అదుపులోకి తీసుకున్న నిందితుడి వివరాలను పోలీసులు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం సమయంలో మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో మంచిర్యాల ఇన్స్‌పెక్టర్ బన్సీలాల్ తన సిబ్బందితో కలసి పెట్రోలింగ్ చేసే క్రమంలో పోచమ్మ టెంపుల్ దగ్గర దేవనాథ్ రాయ్ అనే యువకుడు అనుమానస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని విచారించగా కలకత్తకు చెందిన యువకుడు మంచిర్యాలలోని చింతపండువాడలో నివాసముంటూ ట్రైన్‌లలో సమోసాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గంజాయికి బానిసైన యువకుడు సమోసాలు అమ్మగా వచ్చిన డబ్బులతో తన జల్సాలు చేసేవాడు. డబ్బులు సరిపోకపోవడంతో మహారాష్ట్రలో గంజాయి తక్కువ ధరకు తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. బలార్ష నుంచి 1/4 కేజీ గంజాయి తీసుకొని శనివారం పోచమ్మ గుడి వద్ద సేవించి మిగితది విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ ఆర్.బన్సీలాల్ తెలిపారు. నిందితుడి వద్ద నుండి 240 గ్రాముల గంజాయితో పాటు గంజాయికి ఉపయోగించే హుక్కాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తూకం వేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించాలి

- కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్



నవతెలంగాణ-జన్నారం

తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే గోదాంలకు తరలించాలని తహసీల్దార్ సి.రాజ మనోహర్ రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని మురిమడుగు, కలమడుగు గ్రామాలలో పర్యటించారు. గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి ఓటర్లకు ఆయన ఓటర్ల స్లిప్పులను అందించారు. అలాగే ఇందన్‌పల్లి, జన్నారం తదితర గ్రామాలలో ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి కొనుగోలు కేంద్రం సిబ్బందికి సూచనలు చేశారు. ధాన్యం నిల్వలు పెరిగిపోకుండా ఎప్పటికప్పుడు గోదాంలకు పంపించాలన్నారు. అదే విధంగా ఓటరు స్లిప్పులు పొందిన ఓటర్లు తమ హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

నిర్ణీత గడువులో పోలింగ్ స్లిప్స్ పంపిణీ చేయాలి

- పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు రవీష్ గుప్తా



నవతెలంగాణ-జైపూర్

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున మండల పరిధిలో పోలింగ్ స్లిప్స్ నిర్ణీత గడువులో పంపిణీ చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు రవీష్ గుప్త సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. మండల పరిధిలో గుర్తించిన పోలింగ్ స్టేషన్లు, వసతుల కల్పన తదితర విషయాలపై స్థానిక తహసీల్దార్ వనజా రెడ్డిని అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులతో పాటు చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రకళ, సెక్టర్ అధికారి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తిరుపతి ఉన్నారు.

ఘనంగా ప్రపంచ పశువైద్య దినోత్సవం

నవతెలంగాణ-జన్నారం



ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలోని పశు వైద్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల పశువైద్యాధికారి డా. కస్తూరి శ్రీకాంత్‌ను పశు జంతు ప్రేమికులు మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ప్రతి ఒక్కరూ నోరులేని మూగజీవాలపై కరుణ ప్రేమ దయ కలిగి ఉండాలన్నారు. జంతువులను ప్రేమించాలన్నారు. కాల్వ శ్రీనివాస్, రైతులు, పశు జంతువు ప్రేమికులు, పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరముందని ఎస్ఎస్సీడబ్ల్యూయూ (ఐఎఫ్‌టీయూ) నాయకులు అన్నారు. శనివారం శ్రీరాంపూర్ కాలనీలో 138వ మే డే పోస్టలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ట్రాక్టర్ వర్కర్స్ యూనియన్(ఎస్సీసీడబ్ల్యూయూ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానందం మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో కేంద్రంగా కార్మికవర్గం 8 గంటల పనిదినాన్ని కోరుతూ పారిశ్రామిక యాజమాన్యాలకు వ్యతిరేకంగా సమ్మె చేపట్టారని తెలిపారు. అరెస్టులు, కేసులు, నిర్బంధం, చివరికి కాల్పులు కూడా ఆనాటి ప్రభుత్వం కార్మిక వర్గం పై జరిపిందన్నారు. ఈ కాల్పులలో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, ప్రభుత్వం ఉరిశిక్షలు కూడా వేసిందని, వారి త్యాగాల వల్ల కార్మికులు ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు. నాటి నుండి ప్రపంచ కార్మిక వర్గం మే ఒకటవ తేదీన పారిశ్రామిక వర్గ పోరాట దినంగా పాటిస్తున్నారన్నారు. కార్మిక వర్గం హక్కుల కోసం పోరాడి అమరులైన చికాగో అమరవీరులకు (కార్మికులకు) మే 1న నివాళులర్పించడం జరుగుతుందన్నారు. జాతీయవాదం పేరుతో దేశంలోని 45 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికుల జీవితాలను బీజేపీ మోడీ ప్రభుత్వం సంక్షోభంలో నెట్టిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన పది ఏండ్లలో బీజేపీ ప్రభుత్వం రక్షణ రంగంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను వాటి ప్రయివేటీకరిస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందన్నారు. చికాగో అమరవీరులకు నివాళులర్పిస్తూ మరోపక్క కార్మిక చట్టాలు, హక్కులను కాపాడుకోవాడానికి పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, సురేష్, రాజేష్, రాంబాబు, అనిల్, సమ్మయ్య, శ్రీనివాస్, రాము, కుంటాల స్వామి, కవిత, మల్లేశ్వరి, శిరీష, సత్యక్క పాల్గొన్నారు.

మే డేను ఘనంగా నిర్వహించుకోవాలి

- సింగరేణి కాలరీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-నస్పూర్

ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన 138 వ మే డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని కార్మిక వర్గం పోరాటం నిర్వహిస్తున్న తరుణంలో అక్కడున్నటువంటి ప్రభుత్వం కార్మికులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపిందన్నారు. కార్మికులు చిందించిన రక్తంలో తడిసిన తమ చొక్కాలని ఎర్రజెండాగా చేశారన్నారు. ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం వాటికి విరుద్ధంగా కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నారని, కార్మిక వర్గమంతా చికాగో అమరవీరుల స్ఫూర్తితో ఆ చట్టాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. సింగరేణిలో నూతన అండర్ గ్రౌండ్ గనులు, సొంత ఇళ్లు,పెర్క్స్ పై ఐటి మినహాయింపు కోసం భవిష్యత్తులో కార్మిక వర్గమంతా తమ హక్కులను పోరాటాలతో సాధించుకోవాలని అన్నారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో జరిగే సమావేశానికి కార్మికులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గతంలో టీబీజీకేఎస్‌లో పనిచేసిన 30 మంది కార్మికులు సీతారామయ్య సమక్షంలో ఏఐటీయూసీ సాధించిన హక్కులు చేసిన పోరాటాలకు ఆకర్షితులై ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శి మోతే లచ్చన్న, అఫ్రోజ్ ఖాన్, దాడి రాజయ్య,నల్లపు సత్తయ్య, మోహన్ రెడ్డి, గండి సతీష్, మల్లెత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-జన్నారం

ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు విశ్రాంతి సమయంలో నీడ, మెడికల్ కిట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ శశికళ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లలతో ఉపాధి హామీ పనులపైన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఉపాధి పని జరిగే ప్రదేశంలో నీడ, మంచి నీటి వసతితో పాటు మెడికల్ కిట్లను ఖచ్చితంగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదే విధంగా ప్రతి గ్రామంలో 200 మందికి తగ్గకుండా లేబర్లను పనికి వచ్చేలా చూడాలన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా చూసుకోవాలని, ఒకవేళ ఏమైనా సమస్య ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నయ ద్వారా తాగునీరు అందించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య, నర్సరీ నిర్వహణ సక్రమంగా ఉండాలరన్నారు. అనంతరం మెడికల్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో అందరికి మెడికల్ కిట్లను మెడికల్ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రమేష్, ఏపీఓ రవీందర్, ఈసీ విలాస్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సోడా, పండ్లు అమ్ముతూ కాంగ్రెస్ ప్రచారం



నవతెలంగాణ-జన్నారం

అదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఆత్రం సుగుణని భారీ మెజారిటీతో గెలిపించడమే ప్రతీ కార్యకర్త లక్ష్యంగా పెట్టుకోవాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నాయకులు సోడా, పండ్లు అమ్ముతూ ప్రచారం నిర్వహించారు. ప్రజలు, వ్యాపారులను కలిసి కరపత్రాలను అందిస్తు చేతి గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు సుభాష్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫసివుల్లా, పట్టణ అధ్యక్షులు దుమాల రమేష్, జన్నారం ఎంపీటీసీ ఎండి రియాజుద్దీన్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎండి సాదుపాషా, ఎస్సీ సెల్ అధ్యక్షులు మామిడిపల్లి ఇందయ్యా, సీనియర్ నాయకులు ఎండి రియాసత్ అలీ, సయ్యద్ రఫీ ఉల్లా, కోల పద్మారావు, నర్సింగరావు, లకావత్ తిరుపతి, అల్లం నరేందర్, మహమూద్, వాసాల రాజేశం, యువజన కాంగ్రెస్ నాయకులు మంద రాజేష్ పాల్గొన్నారు

138వ మే డేను జయప్రదం చేయండి

నవతెలంగాణ-జన్నారం

మే డే ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ప్రభంజనం అన్నారు. శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాదంపెల్లి గ్రామంలో మేడే కరపత్రాలు విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 138వ మే డేని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. దేశ సంపద 50 శాతం పైగా కార్పొరేట్ల చేతుల్లోనే ఉందన్నారు. దేశ సంపద శ్రమజీవుల చేతుల్లోకి వచ్చినప్పుడే దేశంలో పేదరికం అంతమవుతుందన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ల, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా దేశాన్ని మార్చే పనిలో ఉన్నారని ఆరోపించారు. దానిలో భాగంగానే 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులను బానిసలుగా చేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలి కార్మికుల దినసరి వేతనాన్ని పెంచి వారికి భద్రత కల్పించాలని, ఫ్రీ హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకుడు ప్రశాంత్, భీమయ్య, రాజన్న, మైకారాపు సిద్దు, శంకర్, సురేష్, సత్తన్న, కార్మికులు పాల్గొన్నారు.



సబ్బండ వర్గాల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ సబ్బండ వర్గాల సంక్షేమమే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. శనివారం మంచిర్యాల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పది సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. బసంత్ నగర్‌లో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేయాలని విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం, తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఢిల్లీలో కొట్లాడాలంటే ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తవ్వకాలు జరిపిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి



నవతెలంగాణ-జైపూర్

సుప్రసిద్ధ వేలాల గట్టుమల్లన్న ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిల్ల మల్లేష్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ గుప్త నిధుల తవ్వకాల పట్ల గోప్యత పాటించిన ఆలయ పూజారి, దేవాదాయ శాఖ ఈఓ తీరు అనుమానంగా ఉందని పేర్కొన్నారు. ఆలయంలో తవ్వకాలు జరిపినట్లు గుర్తించిన వెంటనే గ్రామస్తులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉండగా విషయాన్ని బయటకు పొక్కకుండా చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు శివలింగాన్ని తవ్వి తీయగా ఈఓ సిమెంట్‌తో శివలింగాన్ని తయారు చేయించడం వెనుక రహస్యమేమిటని ప్రశ్నించారు. దుండగులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విషయాన్ని బయట ప్రపంచానికి తెలియకుండా గోప్యత పాటించడమే కాకుండా తవ్విన శిలింగం స్థానంలో సిమెంట్ శివలింగాన్ని ఏర్పాటు చేసిన దేవాదాయ ఈఓను విధుల నుండి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు సుందిల్ల గట్టయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మీసాల తిరుపతి, మీసాల రాజకుమార్, హరీష్, జశ్వంత్, సుంకరి అజయ్ పాల్గొన్నారు.

హామీలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

హామీలతో ప్రజలను కాంగ్రెస్ మభ్యపెడుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య నివాసంలో కొప్పుల ఈశ్వర్, మాజీ చెన్నూరు ఎమ్మెల్యేతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలో ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదని మండిపడ్డారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొత్త హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. పదేండ్ల కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ గతంలో ఆంధ్రాని తెలంగాణలో బలవంతంగా కలిపిందని, 1969 తెలంగాణ ఉద్యమంలో 369 విద్యార్థులను బలి తీసుకున్న, 2004లో తెలంగాణ ఇస్తామని మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబ పాలనని విమర్శించిన కాంగ్రెస్ పెద్దలు ఒకే పార్లమెంటు నియోజకవర్గంలో వివేక్, వినోద్ ఇద్దరికి ఎమ్మెల్యేలు ఇప్పుడు పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా వివేక్ కొడుకుకు టికెట్ ఇవ్వడం కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు. చెన్నూరు మేనిఫెస్టోలో చెప్పిన అగ్రికల్చర్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ ఫ్యాక్టరీలు ఏమయ్యాయన్నారు. సింగరేణి సంస్థలో 26 సంవత్సరాలు పనిచేసిన కార్మికుడు, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, నాయకులు రాజా రమేష్, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ సస్పెన్షన్

- నూతన సీఐగా రవి నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ఎక్సైజ్ కమిషనర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ శామ్యూల్ జాన్‌ను సస్పెండ్ చేస్తూ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఫిబ్రవరిలో కాగజ్‌నగర్‌లో సీఐగా బాధ్యతలు స్వీకరించిన శామ్యూల్ జాన్ అప్పటి నుండి సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ ఫిర్యాదులు అధికంగా వస్తున్నా వాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారు. మరోపక్క మద్యం వ్యాపారులు కూడా అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నారు. వీటికంతటికీ కారణం సీఐ శామ్యూల్ జాన్ విధి నిర్వహణ సక్రమంగా లేకపోవడమేనని గుర్తించిన కమిషనర్ సీఐని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. కాగా ఈయన స్థానంలో ఆదిలాబాద్ ఘన్‌పూర్ చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న రవిని సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నేడో, రేపో ఆయన కాగజ్‌నగర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

పశుపక్ష్యాదుల ద్వారా పర్యావరణ సమతుల్యత

- జిల్లా పశు వైద్యాధికారి ఎం. సురేష్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మన చుట్టూ ఉన్న పశు పక్ష్యాదులను కాపాడితేనే పర్యావరణ సమతుల్యత దెబ్బ తినకుండా ఉంటుందని జిల్లా పశు వైద్యాధికారి ఎం.సురేష్ అన్నారు. ప్రపంచ పశు వైద్య దినోత్సవం పురస్కరించుకొని శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా డా.సురేష్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది ఏప్రిల్ నెల చివరి శనివారాన్ని ప్రపంచ పశు వైద్య దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. పెంపుడు పశు జాతులు, జంతు ప్రదర్శనశాలలోని జంతుజాతులు, అడవిలో ఉండే జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ పశు వైద్యాధికారి ఎం.విజయ్, వెటర్నరీ అసిస్టెంట్ పి.శైలేందర్, అటెండర్‌లు సీహెచ్.సాయిలు, ఎంఎ జాఫర్, గోపాలమిత్రలు జమీర్, రమేష్‌బాబు, విజయ్ డైరీ సభ్యుడు ఎ వంశీకృష్ణ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పని చేయాలి

- మంత్రి సీతక్క

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పార్లమెంట్ ఆదిలాబాద్ లోకసభ అభ్యర్థి ఆత్రం సుగుణక్క గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. మారుమూల గ్రామాలు అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. చేతి గుర్తుకు ఓటేసి సుగుణక్కని గెలిపించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏ పార్టీ కూడా ఆడబిడ్డకు ఎంపీగా అవకాశాలు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ మాత్రం విద్యావంతురాలైన సుగుణక్కకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం జరిగిందని, ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జిల్లా జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, మాజీ జడ్పీ చైర్మన్ సీడం గణపతి, జిల్లా ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, నాయకులు వేణుగోపాల్ చారి, ఎంపీపీలు సుజాత, సులోచన, జడ్పీటీసీ సముద్రాల సరిత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు బండు పాల్గొన్నారు

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లికి పూలమాలవేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. గత ప్రభుత్వంలో జరిగిన అనేక సంక్షేమ పథకాలను కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ ఇప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఆర్ గ్యారంటీలను అమలు పరచకుండా కాలాయాపన చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన ప్యాక్స్ చైర్మన్ సంజీవ్ కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేందర్ గౌడ్, టౌన్ అధ్యక్షుడు రాపర్తి అశోక్, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ, కో ఆప్షన్ జహీరోద్దీన్, మహిళ మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ మురళి గౌడ్, తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు పల్లె రాజేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాల సంఘం గౌరవ అధ్యక్షుడు మృతి

నవతెలంగాణ-నస్పూర్

గుండెపోటుతో నస్పూర్ మాల సంఘం గౌరవ అధ్యక్షుడు పసరకొండ రాజయ్య శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల సంఘం నాయకులు మాట్లాడుతూ మాల బాంధవుడు స్నేహశీలి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశలను సాధించడానికి కృషి చేసాడని కొనియాడారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, మాల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు గోశిక మనోజ్, నాయకులు జివాజీ నందయ్య, గరిసె రామస్వామి, తలారి రాజు, సురిమిల్ల రత్నం, రాజయ్య, పద్మారావు, చెలిమల లింగమూర్తి పాల్గొన్నారు.

రేపటి నుంచి సదరన్ శిబిరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 29 నుండి నిర్వహించే సదరన్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూగ, చెవిటి, కంటి చూపు సదరన్ క్యాంపు ఈ నెల 29వ తేదీన, మానసిక వైకల్యం, ఎముకలకు సంబంధించి సదరన్ క్యాంపు 30న, మళ్లీ వచ్చేనెల 7వ తేదీన కంటి చూపు, 18న మానసిక వైకల్యం, 21న మూగ చెవిటి, 28న ఎముకలకు సంబంధించిన సదరం క్యాంప్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మే 8 వరకు ఓటరు స్లిప్పుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలింగ్ స్టేషన్‌లలో సంబంధిత బూత్‌స్థాయి అధికారుల ద్వారా మే 8వ తేదీ వరకు ఓటరు సమాచార స్లిప్‌లను పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా అధికారులతో ఇన్‌ఛార్జ్‌లుగా ఫిర్యాదు పర్యవేక్షణ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఫిర్యాదుల కొరకు ఆదిలాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ మానిటారింగ్ సెల్ ఇన్‌చార్జ్ అధికారి సంపతి శ్రీనివాస్ తహసీల్దార్‌ను 7670858440 సంప్రదించాలని సూచించారు. అలాగే బోథ్ అసెంబ్లీ సెగ్మెంట్ మానిటారింగ్ సెల్ ఇన్‌చార్జ్ అధికారి తుకారాం, తహసీల్దార్, ఇచ్చోడ 9440995663 సంప్రదించాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఫిర్యాదు టోల్ ఫ్రీ నెంబర్లు 1950, 1800 425 1939 అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఓటరు సమాచార స్లిప్‌ల (వీఐఎస్) పంపిణీకి సంబంధించి ఏవైనా ఫిర్యాదులకు పైన పేర్కొన్న నెంబర్లకు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులకు షీటీం బృందం అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

షీటీం ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ కంప్యూటర్ సెంటర్‌ను శనివారం సందర్శించి, షీటీం విధులపైన సైబర్ క్రైమ్‌పైన అవగాహన కల్పించారు. అక్కడ కంప్యూటర్ నేర్చుకోవడానికి వచ్చిన విద్యార్థులకు వివరించారు. ఎవరైనా పోకిరీలు అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మాట్లాడిన లేదా వాళ్లతో ఫోటోలు దిగి మోసం చేసిన లేదా ఎప్పుడో దిగిన ఫోటోలను మార్ఫింగ్ చేసి వేరే వ్యక్తులకు షేర్ చేస్తానని బెదిరించిన బ్లాక్ మెయిల్ చేసిన ఇబ్బందులకు గురి చేసిన వారి వెంటపడిన వేధించి సతాయించిన వెంటనే షీటీం నెంబర్ 8712659953 నెంబరును సంప్రదించాలని సూచించారు. ఎవరైనా బాధితులు డబ్బు రూపకంగా నష్టపోయిన వెంటనే సైబర్ క్రైమ్ నెంబర్ 1930 కాల్ చేయాలని అన్నారు. మైనర్ అమ్మాయిలకు పెండ్లిలు ఎక్కడైనా జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కాల్ చేయాలని, లేదా 100 కి కాల్ చేయాలని సూచించారు. అలాగే గుడ్ టచ్ బ్యాడ్ టచ్ యువకులు కావచ్చు పురుషులు కావచ్చు అమ్మాయిలకు గాని స్త్రీలకు గాని యువతులకు గాని ఉద్దేశపూర్వకంగా మాటిమాటికి తాకినా ముట్టిన లేదా ముట్టడానికి తాకడానికి ప్రయత్నం చేసిన కూడా చట్టరీత్యా నేరమని తెలిపారు. విద్యార్థులు అమ్మాయిల జోలికి వెళ్లి పొరపాటున చిన్న కేసైనా కూడా గవర్నమెంట్ జాబ్ రాదని అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్య చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో షీటీం బృందం ఇన్‌చార్జి బి.సుశీల, సత్యమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పర్యవేక్షించాలి



నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికలు-2024లో భాగంగా మే 13న పోలింగ్ అనంతరం జూన్ 4న జరుగనున్న కౌంటింగ్ ప్రక్రియ కోసం కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై అధికారులు పర్యవేక్షించాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేషుప్తా అన్నారు. శనివారం హాజీపూర్ మండలం ముల్కల్లలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అదికారి బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, డిసిపి అశోకుమార్, మంచిర్యాల ఆర్డీఓ వి.రాములు, ప్రత్యేక ఉప పాలనాధికారి డి.చంద్రకళ, హాజీపూర్, తహసీల్దార్ పి. సతిష్ కుమార్‌తో కలిసి ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్‌కు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్దంగా ఉండాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ జరుగుతుందని, కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశీలకులు బాధ్యతాయుతంగా ఉండాలి

లోక్‌సభ ఎన్నికలు-2024లో భాగంగా ఎన్నికల నిర్వహణకు విధులు కేటాయించబడిన సూక్ష్మ పరిశీలకులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేషుప్తా అన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, డిసిపి అశోకుమార్ సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 3 అసెంబ్లీ సెగ్మెంట్లకు పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌లో భాగంగా చెన్నూర్ నియోజకవర్గానికి 30 మంది, బెల్లంపల్లి నియోజకవర్గానికి 33 మంది, మంచిర్యాల నియోజకవర్గానికి 32 మంది సూక్ష్మ పరిశీలకులను కేటాయించడం జరిగిందన్నారు. అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేరగాళ్లు తమ నేర ప్రవృత్తి మార్చుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నేరగాళ్ల తమ నేర ప్రవృత్తిని మార్చుకోవాలని యువత మత్తు పదార్థాలకు గురికాకూడదని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లాలో గంజాయి రవాణ నివారణ కోసం శుక్ర, శనివారాలు రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసిన క్రమంలో జిల్లా కేంద్రంలోని నేరగాళ్లకు కౌన్సిలింగ్ నిర్వహించినంతరం డీఎస్పీ సదయ్యతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నివారణ కోసం రెండు రోజుల పాటు నిర్విరామంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో అనుమానం ఉన్న ప్రతి ప్రదేశంలో సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సోదాలలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 7 కేసులలో 11 మంది నేరస్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులలో 3.112 కేజీ గంజాయి దీని విలువ రూ.77050 స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలోని చెక్‌పోస్టులతో అక్రమ మార్గంలో ఎటువంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభ పెట్టే వస్తువులను జిల్లాకు రాకుండా వివిధ శాఖల సమన్వయంతో 24 గంటల పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలియజేశారు. విద్యార్థులు, పిల్లలు కానీ, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలు అయితే వారి వివరాలను 8712670523 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఎవరైనా ముత్తు పదార్థాలకు బానిస అయితే వారిని డిఅడిక్షన్ సెంటర్ ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చి మత్తు పదార్థాలను మానిపించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, ఆసిఫాబాద్ టౌన్ సీఐ సతీష్, ఎస్సై ప్రవీణ్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాడుతాం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కేసీఆర్ తెలంగాణ సాధన కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని పేర్కొన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి నినాదాలు చేశారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాల వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. పార్టీ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పదాన్ని అసెంబ్లీ రికార్డులను నుంచి తొలగించి, తెలంగాణ పేరు పలికితేనే పార్టీల నుంచి సస్పెండ్ చేసే రోజుల నుంచి రాష్ట్రాన్ని సాధించే వరకు సాగిన ప్రస్థానంలో బీఆర్ఎస్ పార్టీ అత్యంత కీలక పాత్ర పోషించిందని అన్నారు. సమస్త ప్రజానీకం మద్దతుతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా స్వరాష్ట్ర సాధనకు పోరాడారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెన్షన్ దారులు, రైతులు, రైతు కూలీలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజల పక్షాన నిలబడుతూ వారికి అండగా ఉండాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు రోకండ్ల రమేష్, యూనుస్ అక్బని, అశ్రాఫ్, అలాల్ అజయ్, గంద్రత్ రమేష్, సాజిదోద్దీన్, లింగారెడ్డి, రాంకుమార్, స్వరూపరాణి, బోడగం మమతా, పర్వీనా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకులలో ప్రజలకు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో యాజమాన్యాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. బంకులలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం లేదన్నారు. ప్రభుత్వ బంకులలో బోర్ వాటర్‌తో సరిపెట్టి బిల్లులు మాత్రం వేస్తున్నట్టు సమాచారం అడిగితే తాగుతే తాగండి లేదంటే లేదు అన్నట్టుగా అక్కడి సిబ్బంది దురుసుగా వ్యహరిస్తున్నారని ఆరోపించారు. అలాంటి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని లంబాడిగూడ గ్రామ సమీపంలో శనివారం రాత్రి బర్రెకు ద్విచక్ర వాహనం ఢీకొని గురుడు పేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చిన్న సిద్దాపూర్ అత్తగారింటికి వచ్చి వెళ్తున్న క్రమంలో లంబాడిగూడ గ్రామ సమీపం వద్ద బర్రెని గమనించకుండా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారాన్ని గ్రామస్తులు పోలీసులకు అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయలైన శ్రీనివాస్‌కు వైద్యం నిమిత్తం 108లో పీహెచ్‌సీకి తరలించారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని సాంఘిక గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ చైతన్యలు తెలిపారు. ఇంటర్ సెకండియర్‌లో 100 శాతం, ఫస్ట్ ఇయర్‌లో 97 శాతం ఉత్తీర్ణం సాధించారన్నారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో కె అశ్మిత, ఎం అహన్యలు 1000కి గాను 957 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. జి.శివాని 944, ఎం.పావని 929, బైపీసీ సెకండ్ ఇయర్‌లో తోటపల్లి వైష్ణవి 968, ఎం సమత 959, జే స్వాతి 956, ఎంపీసీ మొదటి సంవత్సరంలో సాలిగామ హారిక 470కి గాను 461, ఎం నందిని 435, దుర్గం పావని429, బైపీసీలో జాడి జయరాణి 430, పి.మహిత 421, ఎస్ దీక్షిత 417 సాధించారని తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని సాలెవాడ(బి) గ్రామంలో గేడం జంగు ఇల్లు ప్రమాద వశత్తు దగ్ధం అయింది. శనివారం గ్రామంలో జరుగుతున్న పెండ్లికి వెళ్లారు. ఇంటి దీపాలతో ఇంట్లో మంటలు అంటుకొని ఇల్లు దగ్ధం కావడంతో గ్రామస్తులు నీళ్ల చల్లార్పినట్లు గ్రామ పటేల్ నాగోరావు తెలిపారు. ఇల్లు దగ్ధం కావడంతో ఇంట్లో ఉన్న వంట సామాగ్రితో పాటు రూ.25 వేల నగదు, పట్టాపాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు దగ్ధం అయ్యాయి. రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

మారుమూల గ్రామాల్లో బీజేపీ ప్రచారం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని మారుమూల గ్రామమైన పైకాజిగూడ గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ పర్యటించారు. ఇక్కడ దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుని, పరిష్కారమర్గాలపై గ్రామస్థులు చర్చించారు. ఎంపీగా గెలిచిన వెంటనే దగ్గరుండి అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగేలా నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి ఆత్మారం నాయక్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

మండలంలోని నార్లపూర్ గ్రామంలో బీజేపీ పార్టీలో యువకులు చేరారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికలలో గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, ఆసిఫాబాద్ జెడ్పీటీసి అరిగేలా నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోట్నాక్ విజయ్, అధికార ప్రతినిధి ఆత్మారం నాయక్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని పారిశుధ్య కార్మికులు రావడంలేదని పట్టణంలోని కోలిపురకాలనీ కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు మొహమ్మద్ సోహెల్ తెలిపారు. ఈ విషయమై శనివారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కాలనీలో నీటి సమస్య కూడా ఉందని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కాలనీలో మురికి కాలువలు నిండటంతో రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని సుందరయ్యనగర్ 1వ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. టీచర్ రాధ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి సబిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలతో అలరించిన చిన్నారులకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్లు అవినాష్‌రెడ్డి, వేణు, సీడీపీఓ వనజ, మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ యశోద పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం

నవతెలంగాణ-తాంసి

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి అత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా శనివారం తాంసి మండలంలోని కప్పర్లలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కప్పర్ల గ్రామంలో ఎంపీటీసీ కౌడాల భాగ్యలక్ష్మి సంతోష్, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీలను ఓటర్లకు వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేయడం జరిగిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. వచ్చే ఆగస్టు వరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రభుత్వం అన్నారు. బీఆర్ఎస్ బీజేపీ పార్టీలు ప్రజలను రైతులను మోసం చేసే ప్రభుత్వమేనని అన్నారు. ఆత్రం సుగుణను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటే కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భజరంగ్, సంజీవ్, ప్రభాకర్, రాజన్న, గంగయ్య ఉన్నారు.

బుద్ధుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడువాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

బుద్దుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడువాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని సుభాష్‌నగర్‌లో సారిపుత్త బుద్ధ వీహార్ కమిటీ, యువ సంఘటన కమిటి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పాల్గొన్నారు. ముందుగా గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం బౌద్ధ వందన సమర్పించారు. అంబేద్కర్, గౌతమ బుద్దుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని జోగు రామన్న అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అన్నెల వసంత్, కమిటీల సభ్యులు చంద్రశేఖర్ భగత్, అవినాష్ పాటిల్, వినోద్ పరేకార్, దమ్మపాలీ జీవనే, ప్రశాంత్ తెలంగ్, లోకేష్ పాటిల్, దీపక్ కానిందే, నాగనంద్ తెలంగ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-ముధోల్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జెడ్పీ మాజీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కొంతమంది నాయకులు పార్టీ మారిన, పార్టీకి నష్టం లేదన్నారు. ప్రజలు మన వెంట ఉన్నారన్నారు. ప్రతి రోజు పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల మధ్యలో ఉండాలని సూచించారు. గెలుపే లక్ష్యంగా అందరూ సమన్వయంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బండారి గంగాధర్, మాజీ సర్పంచ్ పోశెట్టి, అశోక్, దిగంబర్, నాయకులు విఠల్, షబ్బీర్, గణపతి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రచారం

నవతెలంగాణ-నార్నూర్

అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని డిటి అమృత్‌లాల్, రెవెన్యూ సిబ్బంది శనివారం గ్రామాల్లో ప్రచార రథం ద్వారా ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు భీంపూర్, కొత్తపల్లి, మాలెపూర్, మలంగి తదితర గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రచారం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించి డబ్బుకు, మద్యానికి లొంగకుండా ఓటు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ దశరథ్, కవిత కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్లు వినియోగిస్తే చర్యలు

నవతెలంగాణ-జైపూర్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గల పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్లను వినియోగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలకు సంబంధించి వీవీఐపీ, వీఐపీలు హెలీకాప్టర్లు వినియోగించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో డ్రోన్ వినియోగంపై నిషేధాజ్ఞలు ఉన్నాయని, డ్రోన్ వినియోగంపై నిబంధనలు పాటించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-బోథ్

గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గొల్లాపూర్ పంచముఖి హనుమాన్‌ను దర్శించుకుని, చేపట్టిన ప్రజాయాత్రలో భాగంగా పార్లమెంట్ నాయకులు కోవ దౌలత్‌రావ్ మోకాశీతో కలిసి మండలంలోని గొల్లాపూర్, పార్డి(కె) పూల్‌సింగ్ నాయక్ తండా, సంపత్ నాయక్ తండా, సోనాలలో గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గుడాల శేఖర్, భోజన్న, గాజుల పోతన్న, సంఘపాల్, విజయ్ భాస్కర్, కసిరే పోతన్న, చెట్లపల్లి అనిల్, మద్దెల మహేష్, బిర్సంది గణేష్, ఈర్ల సుధాకర్, అరె చందు, శ్యామ్, గ్రామస్తులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, కిసాన్ సెల్, ఎస్సీ సెల్, ఎస్టీసెల్, బీసీసెల్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.